## క్లుప్తంగా

### నేడు కాళిదాస్ విగ్రహ ఆవిష్కరణ

ఖిలా వరంగల్: శివనగర్ మెట్ల బావి సమీపంలోని యూనిక్ కిడ్స్ హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీపీఐ సీనియర్ నేత దివంగత మడత కాళిదాస్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ ప్రతినిధులు తెలిపారు. విగ్రహ ఆవిష్కరణకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపెల్లి వినోద్‌కుమార్, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, విద్యావేత్త గట్ల రాంరెడ్డి హాజరుకానున్నారని వివరించారు.

### రేపు తొర్రూరులో రక్తదాన శిబిరం

హన్మకొండ: రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 12న తొర్రూరులో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్.శ్యామ్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పోలీసు స్టేషన్‌లో సోమవారం ఉదయం రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరాన్ని తొర్రూరు సీఐ సత్యనారాయణ, అక్కడి పోలీసుల సహకారంతో నిర్వహించనున్నట్లు తెలిపారు.

### పంచముఖాంజనేయుడికి ప్రత్యేక పూజలు



ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని రామచంద్రస్వామి దేవాలయం ప్రాంగణంలోని పంచముఖాంజనేయ స్వామికి భక్తులు, పూజారులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి వెంకటేశ్వర చార్యుల ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటీ ప్రతినిధులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు మంచాల కృష్ణమూర్తి, శ్రీరాం రాజేష్, నవీన్, ఆడెపు శ్యాం తదితరులు పాల్గొన్నారు.

### మురుగు కాలువల్లో వ్యర్థాల తొలగింపు



కాజీపేట: భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు నీట మునగకుండా మురుగునీటి కాలువల్లో పేరుకుపోయిన మట్టి, వ్యర్థాలను యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నట్లు కార్పొరేటర్ విజయశ్రీ అన్నారు. కాజీపేట 63వ డివిజన్‌లోని పలు కాలనీల్లో పారిశుద్ధ్య పనులను శనివారం ప్రారంభించారు. పలు ప్రాంతాల్లో జేసీబీల సహాయంతో కాలువల్లో పూడిక తీయించినట్లు చెప్పారు.

### గ్రామ కమిటీల ఎన్నిక

హసన్‌పర్తి: ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎం ముచ్చర్ల గ్రామకమిటీల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎంఎస్పీ మండల కోఆర్డినేటర్ రాజారపు భిక్షపతి తెలిపారు. ఎమ్మార్పీఎస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా మట్టెడ రాజేందర్, అధికార ప్రతినిధిగా బొక్క కన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా బొక్క విజయ్‌కుమార్, కార్యదర్శిగా సంపత్, ఎంఎస్పీ అధ్యక్షుడిగా మహేందర్, అధికార ప్రతినిధిగా రజనీకర్, ఎంఎంఎస్ అధ్యక్షురాలుగా మట్టెడ రమాదేవి, అధికార ప్రతినిధిగా హైమావతి, ప్రధాన కార్యదర్శిగా జయ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాజారపు భిక్షపతి వెల్లడించారు.

### కొండా లక్ష్మణ్ విగ్రహ ఏర్పాట్లు

వరంగల్ అర్బన్: చేనేత కార్మికులు, వ్యాపారులకు కేంద్రమైన వరంగల్ కొత్తవాడ గోపాలస్వామి గుడి జంక్షన్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపన పనులు ప్రారంభమయ్యాయి. ఈమేరకు ఏర్పాట్లను మేయర్ గుండు సుధారాణి, అధికారులు శనివారం పరిశీలించారు. వేగవంతంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

### గ్రూప్ -1 పరీక్షను స్వచ్ఛందంగా బహిష్కరిస్తున్నాం

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో ఈనెల 11న జరగనున్న గ్రూప్ -1 పరీక్షను స్వచ్ఛందంగా బహిష్కరిస్తున్నట్లు బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) కేయూ ఇన్‌చార్జ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ తెలిపారు. కాకతీయ యూనివర్సిటీలో లైబ్రరీ వద్ద విద్యార్థి సంఘం నాయకులతో కలిసి ఆయన శనివారం మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణలో ఎనిమిదేళ్ల తరువాత గ్రూప్ -1 నోటిఫికేషన్ విడుదల చేయగా, టీఎస్‌పీఎస్సీ ఉద్యోగులే పరీక్షా పత్రాలను లీక్ చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. దాంతో గ్రూప్ -1 పరీక్షను ప్రభుత్వం రద్దుచేసిందని తెలిపారు. అయితే, ఇప్పటివరకు పేపర్ లీకేజీ బాధ్యులపై ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మామిడి ప్రభాకర్, ఆకారపు క్రాంతి, రమేష్, శ్రీపాల్, సుమన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధం

- పెరుగనున్న సాగు విస్తీర్ణం
- వానాకాలం ప్రణాళిక ఖరారు చేసిన వ్యవసాయ అధికారులు



పంటచేలకు సేంద్రియ ఎరువును తరలిస్తున్న రైతులు



పంట చేలను సిద్ధం చేస్తున్న రైతులు

కాజీపేట: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ భూముల్లో పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. గత కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఎకరాకు రూ.5వేల చొప్పున పెట్టుబడి సాయం అందించడంతో రైతుల్లో ఆనందం తొణకిసలాడుతోంది. ఖరీఫ్ సీజన్ మరి కొద్దిరోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో పంటలు వేసేందుకు వ్యవసాయ పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. కాజీపేట మండలంలోని పది గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లోసాగు చేసే పంటలపై రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో పత్తి, వరి, మొక్కజొన్న, ఇతర పంటలను సాగు చేసేందుకు అనుగుణంగా రైతులు విత్తనాల సేకరణలో మునిగిపోయారు.

**పెరుగనున్న సాగు విస్తీర్ణం**

గత సీజన్ కంటే ఈ ఏడాది పంటల సాగు విస్తీర్ణం పెరుగనుంది. ఈ సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణ శాఖ సూచనలతో పాటు మిషన్ కాకతీయలో చెరువుల అభివృద్ధి జరగడం ఒక కారణంగా చెప్పొచ్చు. ఈ సీజన్‌లో పత్తి, మొక్కజొన్న పంటలతో పాటు అధికంగా వరి పంటను 1500ల హెక్టార్లలో సాగు చేస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం కూడా పెట్టుబడి సాయం కింద రూ.5వేలు ఇవ్వనుండడంతో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడానికి అన్నదాతలు సమాయత్తం అవుతున్నారు.

**7వేల హెక్టార్లలో ప్రణాళిక**

కాజీపేట మండలంలో 10వేల హెక్టార్ల సాగుభూమి ఉండగా దాదాపు 7వేల హెక్టార్లలో రైతులు పంటల సాగు చేపడతారని అధికారులు భావిస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి మారిన పరిస్థితుల దృష్ట్యా పంటల సాగు మరింతగా పెరుగడానికి అవకాశం ఉందంటున్నారు. వాటన్నింటిని పరిగణలోకి తీసుకున్న వ్యవసాయ అధికారులు పంటల సాగుకు అనుకూలంగా ప్రణాళికలను తయారు చేసి ఆమోదించి చర్యలు చేపట్టారు.

**అందుబాటులో విత్తనాలు**

రైతులకు కావాల్సిన పంటల విత్తనాలను ఇప్పటికే మడికొండ, ధర్మసాగర్ సహకార సంఘాల కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. ప్రభుత్వం కల్పించిన రాయితీపై విత్తనాలను అన్నదాతల అవసరాల మేరకు అందించడానికి సన్నాహాలు జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పంటల దిగుబడులను పెంచుకోవాలనే ఉద్దేశంతో అన్నదాతలు పంట చేలల్లో పశువుల పేడ, కోళ్ల పెంట, గొర్రెల ఎరువు కోసం తలామునకలయ్యారు. వేలాది రూపాయలను ఖర్చు చేసి సేంద్రియ ఎరువులను పంటపొలాలకు తరలిస్తున్నారు

### సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలి



పంట దిగుబడులు బాగా పెరగాలంటే ప్రతీ రైతు తప్పనిసరిగా కృత్రిమ ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలి. తద్వారా భూసారం పెరుగుతుంది. ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయి. విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.

\- దొండపాటి శ్రీధర్‌రెడ్డి, ఏఓ, కాజీపేట


# ఎనీ టైం మద్యం

- దూపకుంట రోడ్డుపై డబ్బా ఏర్పాటు చేసి అమ్మకాలు
- నిర్జన ప్రదేశంలో మందుబాబుల ఇష్టారాజ్యం
- అటువైపు వెళ్లేందుకు భయపడుతున్న ప్రజలు, వాహనదారులు



దూపకుంట రోడ్డుపై ఉన్న బెల్ట్‌షాపు





డబ్బా పక్కన పడిఉన్న ఖాళీ మద్యం సీసాలు

ఖిలా వరంగల్: జనావాసాలకు దూరంగా నిర్జన ప్రదేశంలో ఓ డబ్బా ఏర్పాటు చేసి మద్యం చేసి అమ్మకాలు చేస్తున్నారు. అక్కడ పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడైనా మద్యం దొరుకుతుంది. ఈక్రమంలో రాత్రి వేళల్లో అక్కడ అడ్డా వేసి మద్యం తాగి జులాయిలు, ఆకతాయిలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుంటారు. ఆ సమయంలో అటువైపు వెళ్లేందుకు వాహనదారులు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు.

**మామూళ్లు ఇస్తున్నా నాకేం భయం**

వరంగల్ 37వ డివిజన్ దూపకుంట రోడ్డుపై ఓ మహిళ నిర్వహించే ఓ బెల్ట్ షాపులో ఎప్పుడైనా మద్యం దొరుకుతుంది. నగరంలోని పోకిరీలు అక్కడే తిష్టవేసి మద్యం మత్తులో ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తుంటారు. మద్యం అమ్మకాలతో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని, అక్కడ నుంచి బెల్ట్ షాపు తొలగించాలని నిర్వాహకురాలిని స్థానికులు నిలదీస్తే.. పోలీసులకు రోజు, నెలవారీ మామూళ్లు ఇస్తున్నా ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండంటూ తమనే దబాయిస్తోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నిర్జన ప్రదేశంలో ఏర్పాటు చేసిన మద్యం డబ్బాను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

# 'ఎల్‌బీ' కుంభకోణాలపై విచారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బక్క జడ్సన్

నయీంనగర్: లాల్ బహదూర్ (ఎల్‌బీ) కళాశాలలో జరిగిన ఆర్థిక కుంభకోణాలపై సోషల్ ఆడిట్ జరపాలని కాంగ్రెస్ నాయకుడు బక్క జడ్సన్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎనిమిదేళ్లలో కళాశాల నిధులు, ప్రత్యేక రుసుం ఖాతాలు, యూజీసీ నిధులను కళాశాల మునుపటి కార్యదర్శులు దారి మళ్లించారని ఆరోపించారు. 110 మంది విద్యార్థుల హాస్టల్ సదుపాయం కోసం యూజీసీ 1.1కోట్లు మంజూరు చేయగా భవన నిర్మాణం అసంపూర్తిగా ఉందని తప్పుడు వినియోగ ధ్రువీకరణ పత్రం సృష్టించారని అన్నారు. నిర్మాణం పూర్తి కావడానికి ఇంకా రూ.45లక్షలు అవసరమవుతాయని పేర్కొన్నారని తెలిపారు. మరుగుదొడ్లు, పుస్తకాల కొనుగోలు, లైబ్రరీలో సౌకర్యాలకు 9.1లక్షలు మంజూరు చేయగా తప్పుడు రశీదులు ద్వారా సృష్టించి డబ్బును కాజేశారని వివరించారు. సింథటిక్ ట్రాక్ నిర్మాణం కోసం రూ.12లక్షలు మంజూరు కాగా, ఇప్పుడు అక్కడ సింథటిక్ ట్రాకే లేదని ఎద్దేవాచేశారు. యూజీసీ ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# రాంపూర్‌లో 'వెల్ బేబీ షో'



వెల్ బేబీ షోలో పాల్గొన్న ఆర్‌జేడీ ఝాన్సీ

మడికొండ: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాంపూర్ గ్రామంలో రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి అధ్యక్షతన మహిళా శిశు సంక్షేమ శాఖ సమక్షంలో పిల్లలకు వెల్ బేబీ షో కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ లక్ష్మీబాయి మాట్లాడుతూ తల్లిదండ్రుల తమ పిల్లల ఎత్తు, బరువు, జబ్బ చుట్టుకొలతలను ప్రతీనెల అంగన్‌వాడీ సెంటర్లలో తీయించుకొని వారి ఎదుగుదల కోసం పౌష్టికాహారం అందించాలని సూచించారు. వయస్సుకు తగ్గ ఆహారం అందించడం వల్ల చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రం సేవలను పిల్లలతోపాటు బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన, సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, వనజ, ఏఎన్ఎం వసంత, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, మంజుల, శారద, సంధ్య, స్వరూప, పద్మ, ఆయా రజిత పాల్గొన్నారు.

### బాధితులకు పరామర్శ



హన్మకొండ: ప్రమాదంలో గాయపడి కోమాలోకి వెళ్లి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హనుమకొండ లష్కర్‌బజార్‌కు చెందిన రెడ్డి రవికుమార్ కుటుంబ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ శనివారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రవికుమార్‌కు అందుతున్న చికిత్స, ఆరోగ్య పరిస్థితులను వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

### కార్యకర్తలకు అండగా ఉంటా



కాశిబుగ్గ: పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. నాయకులతో కలిసి 20వ డివిజన్‌లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్త నమిండ్ల రాజును పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం కాశిబుగ్గలోని కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ.అయాబ్, ఎంబాడి రవిందర్, జన్ను రవి, గొల్లన రవి, జన్ను వేణు, ఆదాం, రాజు, యాదగిరి, సాబీర్ తదితరులు ఉన్నారు.

# ఎన్టీఆర్‌కు ఘనంగా స్వర నీరాజనం



ఎన్టీఆర్‌కు నీరాజనం అర్పిస్తున్న క్లబ్ సభ్యులు

హన్మకొండ కల్చరల్: నటసార్వభౌమ నందమూరి తారక రామారావు శతజయంతి వేడుకలను పురస్కరించుకుని ఏకశిల కరోకే క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా స్వర నీరాజనం కార్యక్రమం జరిగింది. హనుమకొండలోని వడ్డెపల్లిలో క్లబ్ కార్యాలయంలో శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో క్లబ్ గాయనీగాయకులు పాల్గొని ఎన్టీఆర్ నటించిన పాత చలన చిత్రాలలోని పాటలను పాడి అలరించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నీరాజనం అర్పించారు. కార్యక్రమంలో విజయకుమార్, ప్రగల్లపాటి రాజకుమార్, సుధ, రేవతి, క్లబ్ సాంస్కృతిక కార్యదర్శి నిమ్మల శ్రీనివాస్, సాగంటి మంజుల, విజయలక్ష్మి, రవి, కిషన్, గీతభవాని తదితరులు పాల్గొన్నారు.

### ఫీజుల దోపిడీని అరికట్టాలి

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో పలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు విచ్చలవిడిగా విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ విమర్శించారు. అలాంటి పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఏకశిల పార్కులో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఐటీ, నీట్, సివిల్స్, ఫౌండేషన్ కోర్సుల పేరుతో ప్రైవేట్ యజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని చెప్పారు. అయినప్పటికీ విద్యాశాఖాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, కేయూ అధ్యక్షుడు మచ్చ పవన్‌కల్యాణ్, ఉపాధ్యక్షుడు సుధగాని మధుగౌడ్, నాయకులు జగన్‌సాయి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెరలు సభ్యత్వం తీసుకోవాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ రాజు

నయీంనగర్: వడ్డెర కులస్తులు సభ్యత్వం తీసుకోవాలని సంఘం నాయకులు సూచించారు. వడ్డెర ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్య నాయకుల సమావేశాన్ని గుంజ స్వామి అధ్యక్షతన హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ జెరిపేటి సత్యనారాయణ రాజు మాట్లాడుతూ వడ్డెర కులస్తులకు హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో భవన నిర్మాణానికి త్వరలో భూమి పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈక్రమంలో వడ్డెరలు ప్రతీఒక్కరు సభ్యత్వం తీసుకొని వడ్డెర భవన్ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంతయ్య, రాందాసు, ఉప్పలయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికులకు ఆర్థికసాయం చేయాలి



మాట్లాడుతున్న సాంబయ్యగౌడ్

కాజీపేట: బీసీ కులాల కులవృత్తులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్ష ఆర్థిక సాయాన్ని గీత కార్మికులకు కూడా అందించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్య గౌడ్ కోరారు. కాజీపేట మండలం సోమిడి గ్రామంలోని రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో శనివారం ఏర్పాటు చేసిన సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గౌడ కులస్తులపై కపట తల్లి ప్రేమ చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో చిర్ర నర్సింగ్‌గౌడ్, అమ్మగాని అమ్మయ్య, బుర్ర తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



సెమీ ఫైనల్ మ్యాచ్‌కు టాస్ వేస్తున్న ఎంపైర్లు




ఎంపైర్లుగా వ్యవహరిస్తున్న వారు

కేయూ క్యాంపస్: యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో శనివారం రాత్రి హనుమకొండ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. రెండు సెమీ ఫైనల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. మొదటి సెమీ ఫైనల్ పోటీ వైభవ్ గొక్వాడ్ ఐపీఎస్–11, కరీంనగర్ జట్ల మధ్య జరిగింది. రెండో సెమీ ఫైనల్ మొయిన్ క్రికెట్ అకాడమీ, డాలఫిన్ క్రికెట్ క్లబ్ జట్ల మధ్య పోటీ రాత్రి 10 గంటలవరకు కూడా కొనసాగుతూనే ఉంది. ఆదివారం రాత్రి 9గంటలకు ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నారు. అంతకన్నా ముందు సినిమా (టీవీ) కళాకారులు, హనుమకొండ సీనియర్ క్రీడాకారుల మధ్య ఆదివారం రాత్రి 7గంటలకు క్రికెట్‌మ్యాచ్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హనుమకొండ ప్రీమియర్ లీగ్ క్రికెట్‌పోటీల చీఫ్ ఆర్గనైజర్ మహ్మద్ అబ్దుల్ ఖుద్దూస్, చీఫ్ అడ్వైజర్, ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ సెక్రటరీ ఉదయ భానురావు పాల్గొన్నారు.

# చుక్క నీరు పారడం లేదు

- నిరుపయోగంగా ఎస్సారెస్పీ పిల్ల కాల్వలు
- అభివృద్ధి నిధులు మాయం.. కొరవబడిన పర్యవేక్షణ
- బోర్లపైనే ఆధారపడిన రైతులు





ముళ్లపొదలతో పేరుకుపోయిన మైనర్ కాల్వలు



నిరుపయోగంగా ఉన్న పిల్ల కాల్వ

హసన్‌పర్తి: సాగు నీటి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఎస్సారెస్పీ మైనర్ (పిల్ల) కాల్వలు నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లోని ఆయా ప్రాంతాలకు సాగునీరు అందించడానికి మైనర్ కాలువలు ఏర్పాటు చేసినప్పటికీ వాటి ద్వారా ఎలాంటి ఉపయోగం లేదని రైతులు విమర్శిస్తున్నారు. కాలవ్లో ముళ్ల పొదలు పెరిగాయని చెబుతున్నారు.

**నేలను సస్యశ్యామలం చేయడానికి..**

నాలుగు దశాబ్దాల క్రితం ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలను సస్యశ్యామలం చేయడానికి అప్పటి సర్కార్ ఎస్సారెస్పీ ప్రాజెక్టు నిర్మించింది. ప్రధాన కాల్వలు, ఉపకాల్వలతో పాటు పిల్ల కాల్వలు కూడా ఏర్పాటు చేసింది. ప్రధాన కాల్వల ద్వారా ఉపకాలువలు.. అక్కడి నుంచి మైనర్ కాల్వలకు నీరు అందించాల్సి ఉంటుంది.

**ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు**

ఎస్సారెస్పీ ప్రారంభంలో రెండేళ్ల పాటు మైనర్‌కాల్వ ద్వారా సాగునీరు అందింది. ఆ తర్వాత అధికారుల పర్యవేక్షణ కొరవడింది. అనంతరం మైనర్ కాల్వలు పూర్తిగా నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం ఆ కాల్వలు ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కాలువలు ఆక్రమణకు గురయ్యాయి. కాల్వల అభివృద్ధి కోసం విడుదలవుతున్న నిధులు ఎక్కడికి వెళ్తున్నాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### నీటి కోసం వేచి చూస్తున్నాం



ఎస్సారెస్పీ జలాలు వస్తాయని విలువైన భూములు ఇచ్చాం. కాలువలు నిర్మించారు. అనంతరం అవి నిరుపయోగంగా మారాయి. ఎస్సారెస్పీ జలాల కోసం ఎదురు చూస్తున్నాం. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని తగు చర్యలు తీసుకోవాలి.

\- కేతపాక రవి, రైతు

### బోర్లే ఆధారం



కాల్వలు ఏర్పాటు చేసినా సాగు నీరు రావడం లేదు. కాల్వల్లో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పేరుకుపోయాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా సాగునీరు అందడం లేదు. కాల్వల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

\- రామస్వామి, రైతు

## 'క్రైం కార్నర్

### ఆరేళ్ల బాలిక అదృశ్యం



హసన్‌పర్తి: ఆరేళ్ల బాలిక అదృశ్యమైంది. ఈమేరకు బాలిక తల్లి సమ్మక్క స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేసింది. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం నగరంలోని పూరిగుట్ట ప్రాంతానికి చెందిన సమ్మక్క – రాజు దంపతులకు కుమార్తె జ్యోతి ఉంది. దంపతులిద్దరు కూలీకి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి చిన్నారి జ్యోతి కనిపించలేదు. ఆచూకీ దొరకకపోవడంతో పోలీసులను శనివారం ఆశ్రయించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

### బార్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాజీపేట: కాజీపేట చౌరస్తాలో ఉన్న ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో గుర్తు తెలియని మధ్య వయస్కుడు మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ సోమిడి వీఆర్ఏ సుంచు నర్సయ్య చేసిన ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపర్చినట్లు వివరించారు. వడదెబ్బ తగిలి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు చెప్పారు.

# ప్రాణం తీసిన గాలిదుమారం

ఖిలా వరంగల్: గాలిదుమారంతో కూడిన వర్షంపడుతుండడతో వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ఆకస్మాత్తుగా చెట్టు కూలింది. స్పీడ్‌గా ఉన్న ఆటో రోడ్డుపై కూలిన చెట్టును బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా కొట్టడంతోపాటు ఆటో డ్రైవర్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈఘటన శనివారం రాత్రి వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొలన్‌పల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ 37వ డివిజన్ తూర్పుకోటకు చెందిన కాంగ్రెస్ నాయకుడు మిడిదుల కుమార్(48) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారీగానే శనివారం సాయంత్రం కిరాయి కోసం వరంగల్ బీటు బజార్‌కు కుమార్ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రాయపర్తి మండలం కొలన్‌పల్లి గ్రామ శివారులోకి చేరుకోగా గాలిదుమారంతో కూడిన వర్షం పడుతుండగా చెట్టును ఆటో ఢీకొట్టి బోల్తా పడింది. దాంతో ప్రమాదంలో కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు.